

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

ధారూరు, జూలై 3: ధారూరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోలీసుస్టేషన్ ఆవరణను పరిశీలించి శాంతిభద్రతల నిర్వహణపై ఆయన పలు సూచనలు చేశారు. వీరి వెంట డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ

అంగన్‌వాడీల బలోపేతానికి ప్రత్యేక చర్యలు

» శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ

వికారాబాద్, జూలై 3 : అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అంగవాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నపిల్లలకు బోధించే పాఠ్య ప్రణాళిక, ఆటపాటలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రత్యేక కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగవాడీల్లో గతంలో మాదిరిగా కాకుండా పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా పిల్లలకు ఆటలు, పాటలతో పాటు ప్రాథమిక విద్యాబోధనలు గావించాలన్నారు. షామ్ (అతి తీవ్ర లోప పోషణ) మామ్ (తీవ్ర లోప పోషణ) పిల్లలను గుర్తించి వారికి వారికి కావలసిన పౌష్టిక ఆహారంతో పాటు బాలామృతాన్ని పిల్లలకు కచ్చితంగా ఇచ్చే విధంగా చూడాలన్నారు. గ్రామాల వారీగా ఆశ,అంగన్‌వాడీ, ఏఎన్ఎంలతో పాటు రాష్ట్రీయ బాల స్వాత్యా బృందం కలిసి అంగవైకల్యం, బుద్ధి మాంద్యం పిల్లలను గుర్తించి 31 రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 1079 మంది అంగవైకల్యం గలవారిని గుర్తించడం జరిగిందని, వారికి నెల రోజులలోపు సదరం క్యాంప్‌లు నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా హైదరాబాద్ కేంద్రంగా బుద్ధి మాంద్యం పిల్లలకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణతో పాటు పునరావాసాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లి, శివారెడ్డిపేటలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభ్యసిస్తున్న పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, సుధీర్, శ్రీనివాస్, డీఎం హెచ్‌వో పాల్వన్‌కుమార్, ప్రదీప్ కుమార్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఐదేళ్ల పాటు అభివృద్ధి కోసం శ్రమించా

» మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్ జూలై 3: ఐదేళ్ల పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అభివృద్ధి కోసం శక్తి వంచనలేకుండ శ్రమించానని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లో రూ, 15లక్షల జడ్పీ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవం, అన్నోజిగూడలో రూ, 2లక్షల జడ్పీ నిధులతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు గుర్తు చేశారు. శంకుస్థాపనలు చేసిన పనులన్నీ త్వరగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, అంజనేయులు, జంహగీర్. రవీందర్, నాయకులు కొంతంఅంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, కర్రె రాజేష్, ముత్యాలు. రాధాకృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, రమేష్, వెంకటనారాయణ. శోభారాణి, విమల, సుధాకర్‌రెడ్డి, స్టీవెన్, కందుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్‌లలో ప్రత్యేక పాలనేనా!

- » నేటితో ముగియనున్న జడ్పీటీసీల పదవీ గడువు
- » ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో గౌరవ వేతనం
- » హామీలు నెరవేర్చకుండానే ముగిసిన వైనం
- » ఇప్పటికే పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రత్యేకాధికారుల పాలన
- » స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువు

నిన్నటితో ఎంపీటీసీల పదవీ కాలం..

మండల పరిషత్ పదవీ కాలం నిన్నటితో ముగిసింది. నేటితో జిల్లా పరిషత్ పదవీ కాలం ముగియనుంది. జిల్లాలో 18 మండలాల్లో పద్దెనిమిది మంది జడ్పీటీసీలు, 221 మంది ఎంపీటీసీలు ఉన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో పాలక వర్గాలు కొలువుదీర లేదు. అయితే ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సర్కార్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. దీంతో గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా ప్రజాపరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనే అమల్లోకి రానుంది.





తాండూరు, జూలై 3: నిధులు, విధుల కోసం పోరాడిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులు తమ ఆకాంక్ష సాకారం కాకుండానే తమ పదవీ కాలాన్ని ముగించుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు విడుదలవక అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకపోవడంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా ఈ ఐదేళ్ల పాటు ఉత్సవ విగ్రహాలుగానే కొనసాగారనే విమర్శలు ఉన్నాయి. చివరకు పదవీ కాలం పూర్తయినా పూర్తి స్థాయిలో గౌరవం దక్కకుండానే పదవుల్లో నుంచి దిగిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నెలనెలా చెల్లించాల్సిన గౌరవ వేతనం కూడా సకాలంలో తమకు అందలేదని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు వాపోయారు. ఈనెల 3వ తేదీ బుధవారంతో మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగియగా, 4వ తేదీన జడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, జట్పీటీసీల పదవీ కాలం ముగియనుంది. గత ఐదేళ్ల పాటు నిధులు, విధుల కోసం ఎదురు చూసిన వారు చివరకు తమ కోరిక సాకారం కాకుండానే నిరాశ, నిస్పృహ లతో పదవులను వీడాల్సి వస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పోటీ చేసిన వారు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు హామీలు గుప్పించారే తప్ప కనీసం శాసన మండలిలో ఒక్కసారి కూడా జడ్పీటీసీలు, ఎంపీటీసీల సమస్యలను ప్రస్తావించలేదంటే అతిశయోక్తి కాదు. గత ఐదేళ్లలో మండల పరిషత్, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలలో చేసిన తీర్మానాలకు సంబంధించి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలో మండలాలు పెరిగాయే తప్పా, కొత్తగా ఏర్పడిన మండలాలు పాలక వర్గాలు కొలువుదీరలేదు. మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీలు లేకుండానే గడిచిపోయింది. ప్రజా సమస్యలపై సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాని పరిస్థితులు ఎదురయ్యాయి. పలు ప్రజా సమస్యలపై చర్చ కొనసాగినా పరిష్కారానికి నోచుకున్న సమస్యలు వేళ్ల మీద లెక్కించే విధంగా ఉండడం గమనార్హం.

విధులు లేకుండానే...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 ప్రకారం కల్పించిన విధులు కూడా స్థానిక సంస్థలకు లేకుండా పోయాయి. కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన పంచాయతీరాజ్ యాక్ట్ - 2018 ప్రకారం స్థానిక సంస్థలకు పెద్దగా ఆధికారాలేమీ దక్కలేదు. సర్పంచుల కంటే తమ పరిధి ఎక్కువగా ఉన్నా.. నిధులు రాక, విధులు లేక... ఏమీ చేయలేక పోయామనే ఆవేదన తమకు మిగిలిందని పలువురు ఎంపీటీసీలు, జడ్పీటీలు వాపోయారు. నిధులు కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదు. దీంతో ప్రజలకు నచ్చచెప్పలేక పడరాని పాట్లు పడ్డారు.

ప్రభుత్వమైనా గుర్తించాలి

స్థానిక సంస్థల ప్రాధాన్యతను ప్రస్తుత ప్రభుత్వమైనా గుర్తించాలని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కోరుతున్నారు.ఎన్నికలు జరిగే వరకూ మండల, జడ్పీ పాలక వర్గాల పదవీ కాలం పొడిగించాలని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కోరుతున్నారు. జడ్పీ, మండల పరిషత్‌లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. స్థానిక సంస్థలను నీరుగార్చే విధంగా కాకుండా బలోపేతం చేసే దిశగా కొత్త ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎంపీటీసీల పక్షాన పోరాడుతా



భవిష్యత్తులో ఎంపీటీసీలకు గౌరవం లభించే విధంగా శాసన సభలో మాట్లాడుతా. విధులు, నిధుల కోసం వారి పక్షాన పోరాడుతా. అధికారులు ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వాలి. సభ్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తా.

\- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సీఎంపైనే ఆశలు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టక ముందు రేవంత్ రెడ్డి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీగా పదవుల్లో కొనసాగారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సీఎంకు తెలుసని, తమకు ఎదురైన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని ఆయనపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా ఆశలు పెట్టుకున్నారు. విధులు, నిధులపై భవిష్యత్తులో ఎంపీటీసీలు, జడ్పీటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ విషయంలో సీఎం ప్రత్యే చొరవ చూపాలని స్థానిక సంస్థల సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా నిధులు సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ పదవీ కాలం ముగిసినా.. కొత్తగా ఎన్నికయ్యే వారికైన వారికి విధులతో పాటు నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎనిమిది నెలలుగా అందని గౌరవ భృతి

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలకు ప్రభుత్వం 8 నెలలుగా గౌరవ భృతి చెల్లించలేదని స్థానిక సంస్థల ప్రతినిధులు వాపోతున్నారు. జడ్పీటీసీలకు నెలకు రూ.13 వేలు, ఎంపీటీసీలకు రూ. 6,300 సంబంధిత సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. 2023 నవంబను నుంచి తమకు రావాల్సిన గౌరవ వేతనం ప్రభుత్వం జమ చేయలేదని వారు వాపోతున్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ భృతిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు



ఎంపీటీసీ సభ్యులకు గౌరవం లేదు. కేవలం మండల సర్వసభ్య సమావేశానికి పరిమితం చేశారు. నిధులు, విధులు లేకపోవడంతో గ్రామాల్లో తమకు విలువలేకుండా పోయింది. విధులు, నిధులు, పనుల కోసం ప్రభుత్వంపై ఐదేళ్ల పాటు పోరాటం చేశామే తప్ప ఏ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

శ్రీనివాస్, ఎంపీటీసీ, మంబాపూర్

ఆశించినంత అభివృద్ధి చేయలేకపోయాం



గ్రామాల్లో గత ఐదేళ్లుగా ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. రాబోయే ఎంపీటీసీలకైనా కనీస గౌరవం, ప్రత్యేక నిధులు కేటాయించాలి. అలా కానీ పక్షంలో ఎంపీటీసీ వ్యవస్థ రద్దు చేయాలి. తమ పరిధిలోని సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు ఎంతో ఆశతో తమను గెలిపిస్తే ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయాం.

\- వెంకటేశ్ చారి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గాజీపూర్

పల్లెల్లో 'మీసేవ'లు

కొత్తగా 82 కేంద్రాలు మంజూరు

- » 'మహిళా శక్తి' పేరుతో అతివలకే కేటాయింపు
- » ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లోనే అందుబాటులో ఉన్న 'మీసేవ' కేంద్రాలు ఇక మారుమూల పల్లె ప్రాంతాల్లోకి కూడా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కూడా మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ ప్రక్రియను మొదలుపెట్టిన ప్రభుత్వం దశల వారీగా వీటిని మరింత విస్తరించాలని భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలను పూర్తిగా మహిళా సంఘాలకే కేటాయించింది. మహిళా శక్తి పేరుతో అర్హులైన సభ్యులకు వీటిని మంజూరు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 82 మీసేవ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 46 ఏర్పాటు కానుండగా వికారాబాద్ జిల్లాలో 20, మేడ్చల్ జిల్లాలో 16 కేంద్రాలను మంజూరు చేశారు. మీసేవ కేంద్రం ద్వారా దాదాపు 40 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్, ధరణి, స్థానికత, ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ఆర్టీసీ, రైల్వే తిరుపతి దర్శనం టిక్కెట్ల రిజర్వేషన్లు వంటి సేవలను ప్రజలు తమ గ్రామం నుంచే పొందే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలు ఆగస్టు 15నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలని ప్రభుత్వం ఆదేశించింది. జూలై 20వ తేదీనుంచి ఈ కేంద్రాలను ప్రారంభించాలని సూచించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలకు ప్రభుత్వ సేవలు తమ ముంగిటే అందనున్నాయి. ఈ ప్రక్రియ విజయవంతమైతే డిమాండ్‌కు అనుగుణంగా మరికొన్ని గ్రామాల్లో కూడా మీసేవ కేంద్రాలను విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ భవనాల్లో కేంద్రాల ఏర్పాటు

కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మీసేవ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రభుత్వ భవనాల్లోనే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గ్రామ పంచాయతీలు. మహిళా సంఘాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, యువజన సంఘాల భవనాల్లో మాత్రమే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొంది.

గ్రామాల్లో ఏర్పాటుకానున్న మీసేవ కేంద్రాలు (జిల్లాల వారీగా)

జిల్లా	కేంద్రాలు
రంగారెడ్డి	46
వికారాబాద్	20
మేడ్చల్	16



మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకే అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అర్హులైన వారిని ఎంపికచేసే ప్రక్రియ మొదలు పెట్టారు. మీ సేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో గ్రామైక్య సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మీసేవ కేంద్రాల నిర్వహణపై

ఎంపిక ఇలా..

ప్రాథమికంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సంఘాల నెలవారి పొదుపుతో పాటు వాటి ప్రగతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాల వివరాలను సేకరిస్తున్నారు. అలాగే రుణాల రికవరీ ఎలా ఉంది? అనే అంశాలను పరిశీలించి వీటి ఆధారంగా సంఘంలోని సభ్యులను ఎంపిక చేస్తున్నారు. ఇంటర్ అంతకంటే ఎక్కువ చదువుకున్న వారే ఈ కేంద్రాల నిర్వహణకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. గ్రామైక్య సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి మీసేవ కేంద్రం నిర్వహణకు ముందుకు వచ్చే మహిళల జాబితాను తీసుకుని వీరిలో ఒకరిని ఎంపిక చేసే బాధ్యత సంఘాలకే అప్పగిస్తున్నారు. ఎక్కువ మందికి సమాన అర్హతలు ఉంటే ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

రూ.2.50లక్షల రుణ సహాయం

మీ సేవ కేంద్రాలు మంజూరైన వారికి వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వం రుణసహాయం అందచేయాలని నిర్ణయించింది. మీ సేవ ఏర్పాటు చేసే సభ్యురాలికి గ్రామైక్య సంఘం సిఫారసుతో స్త్రీనిధి ద్వారా రూ.2.50లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. ఈ రుణంతో మీసేవ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన కంప్యూటర్, ప్రింటర్, కెమెరా, ఇంటర్నెట్, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, టేబుళ్లు వంటివి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ద్వారా అందే దాదాపు 40సేవల ద్వారా మీసేవ నిర్వాహకులకు ఆదాయం సమకూరుతుంది.

అటవీ అధికారుల సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలు అరుణ, శ్యాంసుందర్‌లపై వేటు



మే 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

- » అటవీ శాఖలో తునికాకు బోనస్ నిధుల దుర్వినియోగం
- » ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బోనస్ మింగేశారు' కథనంతో రంగంలోకి దిగిన అధికారులు
- » విచారణలో వెలుగు చూసిన నిధుల స్వాహా పర్వం
- » డబ్బులు రికవరీ చేయాలని ఆదేశాలు
- » అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్

వికారాబాద్, జూలై 3: అటవీ శాఖలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఫారెస్ట్ రేంజ్ అధికారులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వికారాబాద్ ఎఫ్ఆర్‌వో పి.అరుణ, తాండూరు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్‌లపై వేటు వేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) రాకేష్ మోహన్ డోబ్రియాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 28న ఆంధ్రజ్యోతిలో 'బోనస్ మింగేశారు' అధికారుల అనుచరుల ఖాతాల్లో లక్షల్లో తునికాకు బోనస్ డబ్బులు జమ.. అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. తునికాకు కూలీలకు చెల్లించాల్సిన బోనస్ డబ్బుల్లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు అధికారులు అరుణ, శ్యాంసుందర్‌లపై పీసీసీఎఫ్ వేటు వేశారు. జిల్లాలో 2017-18, 2019-2020, 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో తునికాకు సేకరణతో నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ఎక్కువ ఆదాయం సమకూరింది. దీంతో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూలీల శ్రమను గుర్తించి వారికి బోనస్ ప్రకటించింది. కూలీల పని రోజుల ఆధారంగా బోనస్ ప్రకటించి, నిధులను జిల్లాకు విడుదల చేసింది. వికారాబాద్ రేంజ్‌కు విడుదలైన రూ.7,51,861 డబ్బులను కూలీలకు ఇవ్వకుండా అదే శాఖలో పనిచేసే అవుట్ సోర్సింగ్ డ్రైవర్ ఖాతాలో, ఆయన భార్య ఖాతాలో జమ చేశారు. ఆ తరువాత డ్రైవర్ చనిపోగా, ఆయన భార్య వద్దకు వెళ్లి ఖాతాలో జమ చేసిన డబ్బుల గురించి ఆ శాఖ జిల్లా అధికారులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే, తాండూరు రేంజ్‌కు విడుదలైన రూ.8,80,292లను కూలీలకు చెల్లించే విషయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వికారాబాద్ డీఎఫ్‌వో కార్యాలయంలో ఒక్కొక్కరిని విచారించిన అధికారులు రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. వికారాబాద్ రేంజ్‌తో పాటు తాండూరు, పరిగి, కొడంగల్ రేంజ్‌ల పరిధిలో కూడా విచారణ జరిపారు. బోనస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వికారాబాద్ ఎఫ్ఆర్‌వో అరుణతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తాండూరు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్‌లను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తునికాకు కూలీలకు దక్కాల్సిన బోనస్ వారి ఖాతాల్లో జమచేయకుండా ఇతరుల ఖాతాల్లో వేసిన వ్యవహారంపై రాష్ట్ర మంత్రి సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.



అరుణ, వికారాబాద్ ఎఫ్ఆర్‌వో



శ్యాంసుందర్, తాండూరు ఎఫ్ఆర్‌వో

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద ఎన్పీఆర్డీ ధర్నా

మేడ్చల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రూ.300తో ఎలా బతుకుతారని, దానిని రూ.3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.4వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నదని పెన్షన్ పెంపు కోసం 44,49,787 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. కొత్తగా మరో 24,84,000 మందికి ఇప్పటికీ రాలేదన్నారు. 2015 కంటే ముందు సదరన్ సర్టిఫికెట్ పొందిన వారికి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశం లేదని, 2015 ముందు సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం డీఆర్వో హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, లక్ష్మీపతి, సహాయ కార్యదర్శి మల్లేష్, విజయలక్ష్మి, రమేష్, నవ్యా, భాను పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వికలాంగులు

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్

వికారాబాద్, జూలై 3 : మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని, గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని, అన్ని శాఖల కృషితోనే మత్తు పదార్థాలను అరికట్టడం సాధ్యం అని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎక్సైజ్, విద్య, సంక్షేమ, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ తదితర శాఖల అధికారులతో మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు సమన్వయంతో పని చేస్తూ అన్ని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు, వాటి వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువకుల్లో అవగాహన కల్పించాలన్నారు. యాంటీ డ్రగ్ కమిటీల్లో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను భాగస్వామ్యంలో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి వినియోగదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. డబ్బు కోసం ఎవరైనా రైతులు గంజాయి పండిస్తే ప్రభుత్వ రాయితీల రద్దుతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. రైలు, రోడ్డు మార్గాల్లో గంజాయిని తరలిస్తున్నట్టు తెలుస్తోందని, గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జీవరాజ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూలై 3: తమ పదవీకాలం ముగియడంతో మేడ్చల్ మండల పరిషత్ సభ్యులు బుధవారం బీఆర్ఎస్ ఎంపీటీసీలు, పలువురు నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. మండల పరిషత్ పాలకవర్గానికి కార్యాలయంలో వీడ్కోల సభను నిర్వహించి సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీలు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో ఉంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయనంద్‌యాదవ్, నాయకులు భాస్కర్, రాజమల్లారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్‌తో మేడ్చల్ మండల బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

తాండూరు రూరల్, జూలై 3 : మండలంలోని అంతారం తండా పాఠశాలలో అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఎస్.నర్సింహులు, పాఠశాల చైర్‌పర్సన్ సతాబాయి అధ్యక్షతన ఈ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషిచేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దాసు, మాజీ ఉపసర్పంచ్ రాంచందర్, భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్‌నాయక్, ఉపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పోస్టులు భర్తీ చేయాలని ఇంటర్ బోర్డు అధికారికి వినతి


అధికారి జయప్రదతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ◄

దౌల్తాబాద్, జూలై 3: దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాల భవన నిర్మాణం, పోస్టుల భర్తీకి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ జడ్పీటీసీ జంగం వీరన్న, కుర్మని కృష్ణలు బుధవారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ అధికారి జయప్రదను కలిశారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించామని తెలిపారు. నిర్మాణానికి బడ్జెట్ ఫైల్‌ను ఫైనాన్స్ శాఖకు పంపించినట్లు ఆమె తెలిపారు. కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది కోసం పోస్టులు మంజూర్ చేయాలని కోరగా ప్రిన్సిపాల్, అధ్యాపక పోస్టులు 12, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేటర్, నైట్ వాచ్‌మన్ పోస్టులను మంజూరు చేశారు. ప్రభుత్వం నియామకాలు చేపట్టే వరకు వరకు పది మంది అధ్యాపకులను, గెస్ట్ ఫ్యాకల్టీగా, ముగ్గురు బోధనేతర సిబ్బందిని నియమిస్తామన్నారు. వారం రోజుల్లో బడ్జెట్ విడుదలవుతుందని, భవనం నిర్మిస్తామని ఆమె చెప్పారని నాయకులన్నారు.

వినియోగంలోకి యాచారం బస్టాండ్

● వాహనాల పార్కింగ్, దుకాణాలకు టెండర్.. రూ.10వేల మేర ఆదాయం

● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, జూలై 3 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ వినియోగంలోకి వచ్చింది. దాంతో ఆర్టీసీ సంస్థకు నెలకు రూ.10వేల మేర ఆదాయం రానుంది. కాగా, బస్టాండ్ ఏళ్ల తరబడిగా వృథా వినియోగంలోకి తేరేం.. అనే శీర్షికన నాలుగు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ, పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే బస్టాండ్‌ను శుభ్రం చేయించి నాలుగు నెలలుగా బస్సులన్నింటినీ బస్టాండ్‌లోకి మళ్లించి నిలుపుతున్నారు. బస్టాండ్ ఆవరణలో మిషన్ భగీరథ నీటిని నల్లాల ద్వారా అందిస్తున్నారు. మూత్రశాల, మరుగుదొడ్డి వినియోగంలోకి తేవడంతో ఓ కుటుంబానికి ఉపాధి దొరికింది. ప్రస్తుతం దేవరకొండ, ఇబ్రహీంపట్నం డిపోల బస్సులు ఇక్కడ నిలుపుతున్నారు. ప్రత్యేకంగా కంట్రోలర్‌ను నియమించారు. బస్టాండ్ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన ఉద్యోగులు, రైతులు తమ బైక్‌లు పార్క్ చేస్తున్నారు. గమనించిన ఉన్నతాధికారులు బైక్‌లు, కార్ల రక్షణ చూడడం కోసం టెండర్ పిలిచారు. రెండు దుకాణాలను టెండర్ వేశారు. వాటి ద్వారా ఆర్టీసీకి నెలకు కనీసం రూ.10వేల ఆదాయం రానుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు బస్టాండ్‌లో నిలుపుకుంటున్నారు. కాగా, కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలు, బైక్‌లను చూడడానికి టెండర్ పిలిచారు. వాటి ద్వారా సంస్థకు భారీగా ఆదాయం రానుంది. బస్టాండ్ ఎదుట మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు కొబ్బరిబొండాల విక్రయం. టీషాపులు తదితర చిరుతిళ్ల విక్రయాలు చేపడుతున్నారు. ఈమేరకు స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్‌లో సీసీ రోడ్లు వేసి ఆదుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్

గ్రామాల్లో ఫాగింగ్ చేయించిన ఎంపీడీవో

యాచారం : మండలంలోని పలు గ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన వైనంపై ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో 'డ్రైయిన్ల నిర్వహణ మృగ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో నరేందర్ రెడ్డి స్పందించారు. గత రెండు రోజులుగా గ్రామాల్లో సాయంత్రం వేళ ఫాగింగ్ చేయిస్తున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీ గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కార్యదర్శులకు సూచించారు.

కాకునూర్ చౌరస్తాలో మరమ్మతులు

కేశంపేట : మండల కేంద్రంలోని కాకునూర్ చౌరస్తాలో వర్షపు నీరు చెరువును తలపిస్తోందనే అంశాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చెరువును తలపిస్తున్న కాకునూర్ చౌరస్తా' శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి విద్యావతిదేవితో మర్మతులు చేయించాలని సూచించారు. నీటి గుంతల్లో మట్టిని పోయించి చదును చేయించారు. దాంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంది. ఈ సందర్భంగా అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


కేశంపేట : కాకునూర్ చౌరస్తాలో మట్టి పోయించి చదును చేయించిన అధికారులు

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడం తో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

» మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..

» ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

» చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి

» మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

» కుమరం భీం జిల్లాలో ఘటన


అనిత, రమ్య(ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీ కూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మీ, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టీఎస్‌యూటీఎఫ్ నేతలు

రంగారెడ్డి అర్బన్, జూలై 3 : పదోన్నతులు, బదిలీలలో అక్రమాలకు పాల్పడుతున్న డీఈవో సుశీందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులలో నిబంధనలను పాటించకుండా డీఈవో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో స్థానిక జిల్లా ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీఈవో చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. తెలుగు పదోన్నతుల జాబితాలో(సీరియల్ నెంబర్ 19 వి. జానకిరాం ఎంప్లాయ్ ఐడీ నెంబర్ 1917213)నల్లగొండ జిల్లా నుంచి అంతర్ జిల్లా బదిలీల్లో వచ్చారని తెలిపారు. నల్లగొండ నుంచి వచ్చిన ఉపాధ్యాయుడు ఈ జిల్లాకు వచ్చినప్పటి నుంచి సర్వీసును లెక్కించాలి కానీ.. నల్లగొండలో పనిచేసిన సర్వీసును లెక్కించి పదోన్నతి కల్పిస్తున్నారని ఆరోపించారు. ఎల్. ఉమారాణి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అంతర్ జిల్లా బదిలీలో వచ్చారని, ఆమె పేరు కూడా పదోన్నతుల జాబితాలో పొందుపర్చినట్లు చెప్పారు. (సీరియల్ నెంబర్ 256, ఎంప్లాయ్ ఐడీ 1729692). స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో ఆర్డర్‌ను జిల్లా వ్యాప్తంగా కలిపి ఇవ్వకుండా మండలాల వారీగా ఇవ్వడంతో ఎవరు ఏ ప్రాధాన్యతా క్రమంలో బదిలీలు కోరుకున్నారో తెలియకుండా పోయిందన్నారు. దీంతో స్పౌస్ కేటగిరీలో తప్పులు చేసిన వారి వివరాలు తెలియకుండా పోయినట్లు చెప్పారు. పదోన్నతులు కల్పించే సందర్భంలో ఖాళీలన్నింటినీ చూపించకుండానే కొన్ని పోస్టులను బ్లాక్‌లో పెట్టడం వల్ల పదోన్నతులు పొందుతున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతుల జాబితా బయటపెట్టకపోవడం.. పెట్టినా తప్పులతో కూడిన జాబితాను ఇస్తున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు. కె. గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటప్ప, కార్యదర్శి ఈ. గాలయ్య, వైస్ ప్రెసిడెంట్స్ ఎన్. కల్పన, రాములయ్య, కోశాధికారి జగన్నాథ్ శర్మ ఉన్నారు.

రైతులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు

ఘట్‌కేసర్, జూలై 3: రైతులను అన్ని విధాలా అదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో సహకార సంఘం ప్రత్యేక సమావేశం జరిగింది. సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధీర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతుబంధు, కౌలు రైతులకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనిపై విధివిధానాలను రూపొందించే పనిలో ప్రభుత్వం తలమునకలై ఉందన్నారు. రైతులకు మేలు చేయడానికి కృషిచేస్తోందన్నారు. ఎన్నికలతో కొంత జాప్యం జరిగినా ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. అంతకు ముందు రైతులు రైతుబంధుపై తమ అభిప్రాయాలను తెలిపారు. వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, ఎండీ రాహుల్‌రాజ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుదాం

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బంట్వారం (కోట్ పల్లి) జూలై 3: కోటపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధ్యక్షతన కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిలు హాజరయ్యారు. కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మన్ గా నారాయణ రెడ్డితో పాటు పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే ఆగస్టు 15 లోపు రైతు రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం అన్ని సిద్ధం చేసిందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావనతో సీఎం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. అనంతరం కోటపల్లి సమీపంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి. ఎంపీటీసీ మహేష్ గౌడ్, రత్నరెడ్డి, కిషన్‌నాయక్, రామచంద్రారెడ్డి మహేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బందెయ్య, సతీష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

పరిగి, జూలై 3: డెంగ్యూ, మలేరియా వ్యాధుల నిర్మూలనపై ప్రజలు చైతన్యవంతులు కావాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ రవీంద్ర అన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నాల్గో వార్డు టీచర్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమ లార్వాలను నిర్మూలించే టెన్నిపాస్ అనే మందును నిల్వ ఉన్న ప్రాంతాల్లో పిచికారి చేయిస్తామని తెలిపారు. దోమలతో మలేరియా, డెంగ్యూ వ్యాధులొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ రాఘవేందర్ పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధుల నిర్మూలనపై పరిగిలో ర్యాలీ


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి

అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు

మేడ్చల్ టౌన్, జూలై 3: మున్సిపల్ పరిధి అన్ని వార్డులు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం 17వ వార్డులో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ అర్చనసందీప్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... మున్సిపల్‌లోని అన్ని కాలనీల్లో ప్రజావసరాలకు అనుగుణంగా రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి పర్చేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వర్షం నీరు నిలిచి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సందీప్‌గౌడ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణతో మెరుగైన సేవలు

» దక్షిణ మధ్య రైల్వే రీజినల్ మేనేజర్ బర్తీష్‌కుమార్ జైన్


రైల్వే స్టేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న రైల్వే అధికారి

జహీరాబాద్, జూలై 3: 'అమృత్ భారత్'లో భాగంగా రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణతో ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనుందని దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం బర్తీష్‌కుమార్‌జైన్ అన్నారు. బుధవారం ఆయన కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పర్లీ, బీదర్, జహీరాబాద్, వికారాబాద్, ఖానాపూర్ రైల్వేస్టేషన్లను పరిశీలించారు. జహీరాబాద్‌లో కొనసాగుతున్న రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్, వికారాబాద్, తాండూర్ రైల్వేస్టేషన్లలో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆయా రైల్వే స్టేషన్లలో కొనసాగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యకతం చేశారు. పనులను వేగవంతం చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. తాండూర్-జహీరాబాద్ మధ్య నూతన రైల్వేలైన్ల సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. జహీరాబాద్-బీదర్-ముంబయ్ తదితర ప్రాంతాలకు కొత్త రైళ్లను నడిపించేందుకు కృషిచేస్తామన్నారు. ఆర్ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాల్, రైల్వేసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా తాండూరు-జహీరాబాద్ రైల్వే లైన్ సర్వే

పెద్దేముల్, జూలై 3 : తాండూరు నుంచి జహీరాబాద్ మీదుగా రైల్వే లైన్ గురించి సర్వే పనులు చురుకుగా సాగుతున్నాయి. పెద్దేముల్ మండలం రుద్రారం, నాగుపల్లి గ్రామాల శివారు ప్రాంతాల్లో మూన్నాలుగు రోజులుగా సర్వే జరుగుతున్నట్లు తెలిసింది. డ్రోన్‌తో సర్వే చేస్తుండగా రైతులు వారిని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ లైన్ వేసేందుకు ప్రభుత్వ ప్రతిపాదన ఉందని, అందుకే తాము సర్వే చేస్తున్నామని చెప్పారు. దూరభారం తగ్గించే ప్రయత్నంలో తాండూరు-జహీరాబాద్ లైన్ కోసం సర్వే చేస్తున్నామని సర్వే సిబ్బంది రైతులకు తెలిపారు.


ఇబ్రహీంపట్నంలోని నల్లకంచెలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు తీస్తున్న గుంతలను పరిశీలిస్తున్న శ్రీలత

ప్రతీ పంచాయతీలో ఆరువేల మొక్కలు నాటుతాం

» జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం, జూలై 3: వన మహోత్సవం కింద ప్రతీ పంచాయతీలో ఆరువేల మొక్కల చొప్పున మండలంలో 84,000 మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత చెప్పారు. బుధవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకంచె అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంతలను ఆమె పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం గుంతలు పూర్తి చేయాలని రోజుకు రూ.300 కూలి గిట్టుబాటయ్యేట్లు పని చేయాలని కూలీలకు సూచించారు. ఇంటి పెరట్లో నాటుకునేందుకు పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. పొలాల గట్లపై మొక్కలు నాటుకునేందుకు రైతులకు తగు సలహాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సుభాషిణి, ఏపీడీ సక్రియా నాయక్, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చిత్తాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అధిక సాంద్రత పద్ధతితో సాగు లాభదాయకం

» వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రకాంత్

» మెట్టసాగుపై అన్నదాతలకు అవగాహన

మంచాల, జూలై 3 : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. అధిక సాంద్రత పద్ధతి సాగుపై శిక్షణనిచ్చేందుకు ఆరుట్ల, తాళ్లపల్లిగూడ, చిత్తాపూర్‌లకు చెందిన 30మంది రైతులను ఎంపిక చేశారు. వీరికి చిత్తాపూర్‌లో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రకాంత్, విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ సాలుకు మూడు అడుగుల దూరం, మొక్కకు అర అడుగు దూరం ఎడంతో ఎకరాకు 20వేల పత్తి మొక్కల దాకా విత్తవచ్చని చెప్పారు. దీంతో 5 నెలల్లోనే పంట చేతికి వస్తుందన్నారు. అంతేగాకుండా ఒకే కోతలో ఏకకాలంలో పత్తి పంట మొత్తం కాపునకు వస్తుందని తెలిపారు. దీంతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. వానాకాలం, యాసంగి రెండు కాలాల్లో ఈ పద్ధతి ద్వారా పంట సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ సుధీర్, దిలీప్, డాక్టర్ చౌహాన్, ఏఈవో సాయిశ్రీ, ఈవోఆర్డీ మధుసూదనాచారి, వాటర్ సంస్థ ప్రతినిధి మూల కృష్ణ, మాజీ సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసే వారికి గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 3: ప్రజలకు సేవచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మండల పరిషత్ ఆవరణలో బుధవారం ఎంపీటీలకు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్లు ప్రజల కోసం పనిచేసిన ఎంపీపీని, ఎంపీటీసీలను గోల్డెన్ టీంగా అభివర్ణించారు. సుదర్శన్‌రెడ్డిని ఎంపీపీగా చేస్తే ఎమ్మెల్యేగా తనపైనే పోటీచేశాడని ఈ సందర్భంగా మల్లారెడ్డి నవ్వుతూ అన్నారు.

ఊపిరున్నంత వరకు ప్రజాసేవ చేస్తా : ఎంపీపీ

ఊపిరి ఉన్నంత వరకు తాను ప్రజలకు సేవ చేస్తానని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా ప్రజల కోసమే తాను సేవా కార్యక్రమాలు చేసినట్లు గుర్తుచేశారు.కరోనా సమయంలో కోట్ల రూపాయాలను ప్రజల ఆరోగ్యం కోసం వెచ్చించానన్నారు.తాను కొవ్వొత్తి లాంటి వాడినని, తాను కాలిపోతున్నా ప్రజలకు వెలుగునిస్తానని అన్నారు. వైఎస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీవో గీతా రెడ్డి, ఎంపీటీసీలు వెంకట్రామిరెడ్డి, కందుల సరళ, రవి, వినోద, శోభారాణి, భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామిరెడ్డి, ఇక్బాల్, మాజీ జడ్పీటీసీ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మంగమ్మ, కావేరి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, శివశంకర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు సైనికుల్లా పని చేయాలి

మూడుచింతలపల్లి: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని మూడుచింతలపల్లి జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌లో ఎంపీటీసీల వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పనిచేసిన ఎంపీటీసీలు, జడ్పీటీసీకి రానున్న రోజుల్లో మంచి అవకాశాలొస్తాయన్నారు. ఎంపీటీసీలు మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీ కాలంలో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించామన్నారు. తమను ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో వత్సలాదేవి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ హారికమురళీగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు హన్మంత్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, సుగుణసర్వన్, ఎంపీవో మంగతయారు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మండల పరిషత్‌లో పాలక వర్గం వీడ్కోలు కార్యక్రమంలో నాయకులు

ఎంపీటీసీల సేవలు చరిత్రలో నిలిచిపోతాయి

శామీర్‌పేట: ఎంపీటీసీలు గ్రామాల్లో చేసిన సేవలు, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోతాయని మండల ఎంపీటీసీల టీమ్ బాగుందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అభినందిస్తు ప్రశంసించారు. మండల పరిషత్‌లో ఎంపీపీ ఎల్లూబాయి అధ్యక్షతన మండల చివరి సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎంపీపీ, జడ్పీటీసీ అనిత, ఎంపీటీసీలను జ్ఞాపికలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, స్థానిక ప్రజాప్రతినిధుల్లో 95శాతం 210 మందిని గెలిపించిన ఘనత తనదన్నారు. ఎంపీటీసీలు ప్రజలకు ఎంతో సేవ చేశారని ప్రశంసించారు. ప్రజల్లోనే ఉంటూ మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, అధికారులు, తదితర నాయకులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ఎంపీపీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



యాలాల: ఎంపీటీసీలకు సన్మానం

ప్రజాప్రతినిధిగా సేవ చేయడం అదృష్టం

మర్పల్లి: ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవచేయడం తమ అదృష్టమని ఎంపీటీసీ, జడ్పీటీసీ అన్నారు. మండల పరిషత్‌లో ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. ఎంపీపీ భట్టు లలిత రమేశ, జడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ తమను గెలిపించిన ప్రజలకు సేవచేయడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో సుశీల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులకు రిటైర్మెంట్ లేదు

యాలాల: పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. మండల పరిషత్‌లో ఎంపీటీపీలు, మాజీ సర్పంచ్‌లను పదవీ విరమణ సమావేశాన్ని నిర్వహించారు. బాలేశ్వర్‌గుప్తా మాట్లాడుతూ ఐదేళ్లుగా సర్పంచ్‌లు, ఎంపీటీపీలు గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు ప్రజాసేవ చేశారన్నారు. అయితే ప్రజాసేవకు, రాజకీయ నాయకులకు రిటైర్మెంట్ ఉండదని, ప్రజా సేవ ఎంత చేసినా తక్కువే అన్నారు. ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పురుషోత్తం రావు, మాజీ జడ్పీటిసి శ్రీనివాస్, వైస్ ఎంపీ పీ పసుల రమేష్, కోఆప్షన్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్ బాబ, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీ ఈఓ యాదయ్య, ఏవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీలకు సన్మానం

దౌల్తాబాద్: మండల పరిషత్‌లో ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీని అధికారులు సన్మానించారు. పదవీ కాలం పూర్తి కావడంతో వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీ కోట్ల మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

తాండూరు రూరల్: తనకు ఓటు వేసి గెలిపించి ఈ స్థాయికి తీసుకువచ్చిన కోటబాస్పల్లి ప్రజలకు రుణపడి ఉంటానని వైస్ ఎంపీపీ స్వరూపవెంకట్‌రాంరెడ్డి అన్నారు. కోటబాస్పల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్ నాగార్జున అధ్యక్షతన వైస్‌ఎంపీపీకి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్, ఎంపీటీసీల సహకారంతో వైస్‌ఎంపీపీగా అవకాశం కల్పించారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా పనిచేశామని అన్నారు. తమ మామ సాయిరెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. వైస్ ఎంపీపీ కుటుంబం గ్రామ అభివృద్ధికి సొంత నిధులు ఖర్చు గ్రామస్తులన్నారు. పాఠశాలల్లో ప్రతినెలా స్వీపర్‌కు సొంత డబ్బులు రూ.2,500 జీతం ఇస్తున్నారని తెలిపారు. వైస్‌ఎంపీపీ దంపతులను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, బీజేపీ శ్రేణులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజప్పగౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులుగుప్తా, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, వార్డు సభ్యులు విఘ్నేష్, సావిత్రమ్మ, లక్ష్మి, లావణ్య, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, శ్యాంరెడ్డి, సంగారెడ్డి, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మర్పల్లి : ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎమ్మెల్యే

కులకచర్ల: ప్రజాప్రతినిధుల విరమణ పదవీవికే తప్ప ప్రజాసేవకు కాదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌లో నిర్వహించిన సమావేశం, ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేసేవారు శాశ్వతంగా నిలబడతారని, నాయకులుగా ఎదుగుతారని అన్నారు. ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. మండలంలో క్రీడా స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. అనంతరం జడ్పీటీసీ రాందాస్‌నాయక్, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంపీవో కరీం, ఎంఈవోలు హబీబ్ అహ్మద్, హరిశ్చందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, పరిగి బ్లాక్ టూ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కులకచర్లలో ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు రూరల్ : కోటబాస్పల్లిలో వైస్ ఎంపీపీ స్వరూప దంపతులను సన్మానిస్తున్న నాయకులు



దౌల్తాబాద్: ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీని సన్మానిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

వాహనం ఢీకొని బాలుడి మృతి



మృతిచెందిన ఆయూష్

మేడ్చల్ టౌన్, జూలై 3: ఓ బాలుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో మృతిచెందిన ఘటన మేడ్చల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని ఉమానగర్ నివాసి అమిత్‌కుమార్ చిన్న కొడుకు ఆయూష్(4) మంగళవారం సాయంత్రం ఇంటి సమీపంలోని లక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆయూష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తండ్రికి సమాచారమివ్వగా అతను ఆయూష్‌ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం రాత్రి ఆయూష్ మరణించాడు. అమిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కులకచర్ల, జూలై 3: హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన కులకచర్ల కేజీబీవీలో చోటు చేసుకుంది. కులకచర్లకు చెందిన రాములు, సునీత దంపతుల కూతురు మధుశాన్వి గత నెలలో కేజీబీవీలో 6వ తరగతిలో చేరింది. పాఠశాలలో చేరినప్పటి నుంచి తనకు అక్కడ ఉండటం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పింది. అయినా వారు అక్కడే ఉంచారు. బుధవారం సాయంత్రం బాత్‌రూమ్ దగ్గర డబ్బాలో ఉన్న బ్లీచింగ్ పౌడరును నీళ్లలో కలుపుకొని తాగింది. గమనించిన పాఠశాల సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని అక్కడి వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించారు.

వైన్స్‌లో షార్ట్ సర్క్యూట్.. ఫర్నిచర్ దగ్ధం

కొడంగల్, జులై 3: కొడంగల్‌లోని మన కొడంగల్ వైన్స్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దుకాణ యజమాని మంగళవారం రాత్రి వైన్స్‌ను మూసివేసి ఇంటికి పోయాడు. బుధవారం ఉదయం దుకాణానికి వచ్చి చూడగా పొగలు రావడంతో షాప్ తెరిచి చూడగా షార్ట్‌సర్క్యూట్ జరిగిందని గమనించారు. దుకాణంలోని ఫర్నిచర్ దగ్ధమైంది.

కార్యాలయంలో హల్‌చల్ చేసిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్‌రూరల్, జూలై 3: పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయంలో ఆత్యహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన దయ్యాల లక్ష్మమ్మ ఘట్‌కేసర్ పరిధి సర్వే నంబర్102లో భూమిని తన కుమారుడు, కూతుళ్ల పేరిట గిఫ్ట్ డీడ్ చేసేందుకు బుధవారం స్లాట్‌లు బుక్ చేసుకున్నారు. కానీ దయ్యాల అంజయ్య అనే వ్యక్తి ఈ భూమిపై పిటిషన్ ఉందని రిజిస్ట్రేషన్ చేయొద్దని గత 11న పిర్యాదు చేశాడు. బుధవారం అంజయ్య ఐదారుగురు మహిళలతో పెట్రోల్ బాటిల్‌తో కార్యాలయానికి వచ్చి పెట్రోల్ పోసుకుంటానని బెదిరించారు. విధులకు ఆటంకం కలిగించాడని అంజయ్యాపై తహసీల్దార్ రజని పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అన్ని వార్డుల్లో సమాన అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ అశోక్

పరిగి, జూలై 3: అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. బుధవారం రెండో వార్డులో రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం వల్ల నీరు నిలిచి గుంతలు ఏర్పడితే వెంటనే బాగుచేయిస్తామని తెలిపారు. పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్లు అర్చన, కృష్ణ, టి.వెంకటేశ్, నాయకులు రవికుమార్, మౌలనా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 3: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఘనాపూర్, కాచవానిసింగారం, ఎదులాబాద్, అవుషాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. జడ్పీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, ఎంపీటీసీలు వెంకట్రామిరెడ్డి, గట్టగల్ల రవి, కందుల సరళ, బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేష్, మాజీ సర్పంచ్‌లు కావేరిమశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్, రూప్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై నిరసన

మర్పల్లి, జులై 3: పార్లమెంట్‌లో హిందువులకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మర్పల్లిలో నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. లోక్‌సభలో ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు సీహెచ్.మధుకర్, రవీందర్‌రెడ్డి, సుభాష్, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, శ్రీశైలం, మండల కార్యదర్శి శ్రీకాంత్, మండల దళిత మోర్చా అధ్యక్షుడు గణేశ్, మైపాల్, అశోక్ పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తులో పోలీసుల తీరుపై అనుమానాలు

- కౌన్సిలర్ మల్లేషే మాజీ ఎంపీటీసీని హత్య చేయించాడు
- హతుడి తల్లి, అక్కలు, సోదరుడి ఆవేదన
- న్యాయం కోసం సీఎంను కలుస్తామని వెల్లడి

ఘట్‌కేసర్, జూలై 3 : ఇటీవల ఘట్‌కేసర్‌లో హత్యకు గురైన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గడ్డం మహేష్ కేసును నీరుగార్చేందుకు పోలీసులు హంతకులతో కుమ్మక్కయ్యారని మహేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. బుధవారం మహేష్ నివాసంలో అతడి తల్లి మైసమ్మ, సోదరుడు, మహేశ్ అక్కలు, బావలు విలేకరులతో మాట్లాడారు. ఈ హత్య కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై అనుమానాలను వ్యక్తం చేశారు. జూన్ 21న తన అన్న మహేష్ కన్పించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశానని తమ్ముడు విఠల్ చెప్పారు. 22న మహేష్ హత్యకు గురైనట్లు ఘట్‌కేసర్‌కు చెందిన వారు తనకు ఫోన్లు చేయగా ఇదే విషయాన్ని తాను పోలీసులకు చెప్పానన్నారు. పోలీసులు మాత్రం ఫోన్ కాల్‌లిస్ట్ చెక్ చేస్తున్నామని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఘట్‌కేసర్‌లో 960 చదరపు గజాల స్థల వివాదం కోర్టులో మహేష్‌కు అనుకులంగా ఉండటంతో ఆ స్థలం కబ్జాలో ఉన్న కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్ పథకం ప్రకారమే తమ తమ్ముడిని చంపించాడని మహేశ్ అక్కలు అన్నారు. మల్లేష్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మహేష్ పోటీచేస్తే తాను ఓడిపోతాననే కక్షతో హత్య చేశారన్నారు. పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకొని వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. హత్య విషయం తెలిసినా తమకు సమాచారం ఇవ్వకపోవడం పోలీసులు హంతకులతో కుమ్ముక్కైనట్టు కాదా? అని అన్నారు. ఆజానుబాహువుడైన మహేష్‌ను ఇద్దరు బక్కపల్చని వ్యక్తులు కలిసి చంపారని పోలీసులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏ కేసులోనైనా హంతకులను రిమాండ్‌కు తరలించే ముందు పోలీసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని, కానీ ఘట్‌కేసర్ పోలీసులు ఈ కేసులో అలాంటిదేమీ చేయకుండా రహస్యంగా వ్యవహరిస్తున్నందునే తమకు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మహేష్ హత్య కేసులో ఎంత మంది ఉన్నారు? ఎ1 ఎవరు? ఎ2 ఎవరు? మహేశ్ నుంచి ఎంత నగదు దోచారు? బంగారం ఎంత ఉండె? రికవరీ చేసిందెంత? అనే వివరాలను తమకు తెలియలేదని మహేశ్ కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో పోలీసుల తీరుపై న్యాయపోరాటం చేస్తామన్నారు. సీఎంను, ఎస్సీ, మానవ హక్కుల కమిషన్లను కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు.

రైతు భరోసాపై సమావేశం



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

మోమిన్‌పేట్, జులై 3: రైతు భరోసా పథకంపై బుధవారం మోమిన్‌పేట్‌లో ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఆధ్వర్యంలో మోమిన్‌పేట్, మేకవనంపల్లి సొసైటీల పరిధి రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రైతు భరోసా పథకాన్ని 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు వర్తింపజేయాలని రైతులు కోరారు. మరి కొంత మంది 10 ఎకరాల్లోపు వర్తింపజేయాలని కోరారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు ఇవ్వాలన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. అనంతరం కేబీఆర్ గార్డెన్‌లో ఎంపీటీసీలను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మోమిన్‌పేట్, మేకవనంపల్లి సొసైటీల చైర్మన్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి, ఏవో జయశంకర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.శ్రీకాంత్‌గౌడ్, ఏఈవోలు శేఖర్, బాలకృష్ణ, వైస్‌చైర్మన్‌లు, ప్యాక్స్‌ల డైరెక్టర్‌లు, సిబ్బంది రవికుమార్, జహంగీర్, యాదయ్య పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలు సిద్ధం

పరిగి,జూలై 3: మొక్కలు నాటేందుకు ఇదే అదును అని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. బుధవారం మునిసిపల్ పరిధిలోని నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, త్వరలోనే ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి మొక్కను పెంచేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు టి.వెంకటేశ్, మౌలనా పాల్గొన్నారు.

చెంచుపల్లిలో బోరు మోటారు బిగింపు

పూడూరు, జూలై 3 : చెంచుపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బుధవారం బోరు మోటారును బిగించారు. బోరు మోటారు లేక నీటి సమస్య ఏర్పడటంతో స్థానికులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బోరు మోటారును ఇప్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, గ్రామస్తులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

కమిషనర్‌ను కలిసిన బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు

మేడ్చల్ టౌన్, జూలై 3 : గుండ్లపోచంపల్లి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని బుధవారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కౌన్సిలర్లు కమిషనర్‌తో కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు అరం మోహన్‌రెడ్డి, క్రిష్ణాగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

సంక్షిప్తంగా..

● తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్‌లో జినుగుర్తి ప్రాథమిక వైద్యాధికారి రషీద్ బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య శిబిరం నిర్వహించామన్నారు. గ్రామంలో మురుగు కాల్వలను పరిశీలించి దోమల మందును పిచికారిని పరిశీలించామన్నారు. శిబిరంలో 40మందిని పరిశీలించగా, 20 మందికి మలేరియా పరీక్షలు చేశామని తెలిపారు. డాక్టర్ రషీద్, సబ్‌యూనిట్ ఆఫీస్ మల్లేశం, హెల్త్ సూపర్‌వైజర్ సుదర్శన్, సిస్టర్ రాధ పాల్గొన్నారు.

● మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండల పరిషత్‌లో అటెండర్‌గా పనిచేసి రిటైర్ అయిన మల్లేష్ దంపతులను మేడ్చల్ మాజీ ఎంపీపీ పద్మజగన్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. దివ్యాంగుడైన మల్లేష్ సుదీర్ఘ కాలంగా మండల పరిషత్‌లో విధులు నిర్వహించి అందరి అభిమానాన్ని చురగొన్నాడని పద్మ అన్నారు.

● మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ నివాసులు మనీషా, సిద్దిరామ్‌లు కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి ప్రభుత్వం తరపున లభించే రూ.2.5లక్షల ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

● శామీర్‌పేట: ఆపదలో ఉన్నవారికి సాయమందించి ఆదుకోవడమే తన ధ్యేయమని కాంగ్రెస్ నాయకుడు తుంకి రమేశ్ తెలిపారు. మజీద్‌పూర్ గ్రామానికి చెందిన మహ్మద్ జానీ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తుంకి రమేశ్ జానీ కుటుంబీకులకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్మద, అహ్మద్ ఖాన్, సల్మాన్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

● మేడ్చల్ టౌన్: మేడ్చల్ పలు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్, కండ్లకోయ సాయి గీత ఆశ్రమం విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

కొడంగల్ రూరల్: పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న గోపాల మిత్రలకు పీఆర్సీ, వేతన బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడంతో కొడంగల్ నియోజకవర్గ గోపాలమిత్రలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర గోపాల మిత్ర జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో వారు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం కృతజ్ఞతలు తెలిపారు. 23 ఏళ్లుగా సేవలందిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని సీఎంను కోరారు.

అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

తాండూరు, జూలై 3: తాండూరు పరిధి వార్డు నంబరు 20లో బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అంగన్ వాడీ, డ్వాక్రా భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ టి.స్వప్నపరిమళ్, కౌన్సిలర్లు సంగీతఠాకూర్, నీరజబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు హబీలాల పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నాయకుల పరామర్శ

తాండూరు రూరల్, జూలై 3: మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్పను బుధవారం మండల నాయకులు పరామర్శించారు. ఆయనకు ఇటీవల హార్ట్ సర్జరీ అయింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్.వీరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజప్పగౌడ్, మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం, శ్యామ్‌రెడ్డిలు నాగప్ప ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం, యోగక్షేమాలపై అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సన్మానం

కొడంగల్, జులై 3: మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సన్మానించారు. బుధవారం రాత్రి మంజునాథ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి'

మోమిన్‌పేట్, జులై 3: 70 సంవత్సరాల్లో చేయని అభివృద్ధి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లో ఎంపీటీసీల పదవీ విరమణ వీడ్కోలు సమావేశాన్ని ఎంపీపీ వసంత వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అనంతరం ఎంపీటీసీలను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. వైస్ ఎంపీపీ మానసఇంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.శ్రీకాంత్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరం ఎంపీడీవో శైలజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో యాదగిరి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, జులై 3: ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి కావడంతో వారిని శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అధికారులు ఎల్లవేళాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్య ఉందని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కాలె భవానీ, జడ్పీటీసీ కాలె జయమ్మ, మాధవరెడ్డి, ఏఈ ప్రణీత్‌కుమార్, ఎంపీడీవో అనురాధ, పీఏసీఎస్ చైర్మన్‌లు రామ్‌రెడ్డి, పాపిరెడ్డి, రవికుమార్, ఎంపీవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేకు షాక్!

- యాదయ్య చేరికను నిరసిస్తూ శిలాఫలకం ధ్వంసం చేసిన కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట్, జూలై 3: బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సొంత మండలంలో చుక్కెదురైంది. నవాబ్‌పేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఇతర అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయాల్సి ఉంది. అయితే స్థానిక కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. యాదయ్యను కాంగ్రెస్‌లోకి రానివ్వం అన్నారు. ఆయన ఏ పార్టీ అధికారంలో ఉంటే దానిలో చేరుతారని మండల కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే శిలాఫలకం ధ్వంసంతో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని అధికారులు నిలిపివేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనపై పీఆర్ డిఈఈ మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు తెలిపారు.

ఆలయం వద్ద బోరు డ్రిల్లింగ్



శామీర్‌పేట, జులై 3 : మండలంలోని అలియాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ ఆలయం వద్ద బుధవారం ఆ గ్రామ ఎంపీటీసీలు సగ్గు శ్రీనివాస్, కోదూరి అశోక్ బోరు వేయించారు. మండల పరిషత్ అభివృద్ధి నిధులతో ఎంపీటీసీల కోటా నుంచి వారు ఈ బోరు వేయించారు. గత ఆరు నెలల క్రితమే ఈ బోరు వేయించడానికి మండల పరిషత్ నుంచి నిధులు మంజూరైనట్లు ఎంపీటీసీలు చెప్పారు. ఎంపీటీసీల ఐదేళ్ల పదవీ కాలం ముగిసినందున ఆలయం వద్ద భక్తుల, ప్రజల సౌకర్యార్థం ఈ బోరు వేయించినట్లు ఎంపీటీసీలు తెలిపారు. తమను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్న ప్రజలకు సేవలు చేసిన అవకాశాన్ని కల్పించినందుకు, గ్రామాభివృద్ధికి సహకరించిన గ్రామ ప్రజలకు, వివిధ పార్టీల నాయకులకు ఎంపీటీసీలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.